


# గుణాంతరం

– నవులూరి వెంకటేశ్వరరావు

## పిడపర్తి వెంకటరమణశర్మగారి జ్ఞాపకార్థం
## కౌముది నిర్వహించిన నవలల పోటీ (2023)లో
## బహుమతి పొందిన ఉత్తమ నవల

## (గత సంచిక తరువాయి)

"నేరస్థుడు ఒకీలును పెట్టుకోకుండా తన కేసు తాను వాదించుకోడం నేరమంటారా? నిందితుడికి మాట్లాడే స్వేచ్ఛ అన్యాయమూర్తి వద్దనైనా దొరుకుతుంది!"

"అతిగా వాదించుకోడం నేరమే కావచ్చు."

"నేను చేసిన ఒక ఒప్పును తప్పుగా లెక్కవేసి నా వైపు ఒక పిస్తోలు, ఒక మెరిసే కత్తిని చూపిస్తూ చంపుతాననడం యమధర్మరాజుకు కూడా న్యాయం కాదు."

"న్యాయాన్యాల గురించీ మాట్లాడే హక్కును ఏనాడో కోల్పోయావు; అయినా ఉపేక్షిస్తున్నాను. ఆప్యాయంగా, నోరారా 'అన్నయ్య, అన్నయ్య' అని పిలుస్తూ తన వేదనంతా నీ ముందు వెళ్లబోసుకున్న ఆ కుర్రాడు మూర్ఛ రోగంతో కిందపడి కొట్టుకుంటుంటే వాడిని అలా ఒదిలి పారిపోయావు. అది మహాపాపం కాదా, హత్యతో సమానం కాదా?"

"దేముడు చచ్చిపోయాడా?"

"చెప్పను."

"జమ, ఖర్చులతో కూడిన పట్టిక (బాలన్స్ షీట్) లాంటి నా మంచి, చెడుల పట్టికను తమరు సరిగా తయారుచెయ్యలేదని విధితమవుతోంది. మీ తప్పులెన్నటానికి నేనెవడిని? కానీ తప్పులెన్నువారు తమ తప్పులెరుగరు అని పెద్దలన్నారు. నా తప్పులెన్నే హక్కును మీరు పొందారు నన్ను అడగకుండా. మిమ్మల్ని నేను ఏమి చెయ్యలేను. అసహాయుడిని. మీ కత్తీ, పిస్తోలు నన్ను క్షణంలో పొట్టన పెట్టుకోగలవు. ఇది దైవం చేస్తున్న అన్యాయం; మీది కాదు. దేముడిని తిడితే ఏ గొడవా ఉండదు అనుకోడానికి లేదు. ఎవడి మతపు దేముడిని వాడు తిట్టుకోడమూ ప్రమాదకరమే. మరో మతం జోలికి వెళ్లడం గురించీ చెప్పుకోడానికేముంది? తాటో, తలో తీస్తారు."

"నీ మంచిచెడులు దేనికవి రూపాయ, పైసలలా లెక్కవేయగలిగేవి కావని నీ మాయ బుర్రకు తెలియనట్లుంది. ఒక మంచి, ఒక చెడు తూకం వేసి దేని విలువ ఎంతో నిర్ణయించి ఒక దాంట్లో నుంచీ మరొక విలువను తీసి శేషాన్ని నిర్ణయించి అన్ని మొత్తాలను కూడటం యమధర్మరాజుకు సాధ్యమేమో కానీ నాకు కాదు. సరే దేవుడి విషయంలో నీవు చేసిన, మంచీచెడుల గురించీ ముచ్చటించు."

"దేముడి హృదయంలో అది బెలూనులా బద్దలయ్యేంత గోడు గూడుకట్టుకుంది. అతన్ని చూస్తే, దగ్గిరికి వచ్చి మాట్లాడటానికి గొంతు పెగిలిస్తే ఎవడూ వినడు, అసహ్యించుకుని దూరంగా జరిగిపోతారు. పుచ్చుపళ్ళ నోరు తెరిస్తేనే కాదు మామూలుగాకూడా ఒళ్ళు కంపుకొట్టేది. అలాంటిది నేను అతను చెప్పిందల్లా ఓపికగా విన్నాను. ఎవరన్నా కనీసం తన గోడును  వినడమంటే అతని ఆఖరికోర్కెను తీర్చినట్టు. అది ఉపకారంక్రిందికి రాదా?"

నవ్వుదామని అనుకుని, ఆ పని చేస్తే అక్కడి 'గంభీర వాతావరణం' దెబ్బతింటుందని ఆపుకున్నాడు స్వామి.

"పాపం దేవుడు నమ్రతతో అన్నమాటలను వినియోగించుకుంటున్నావు స్వలాభానికి. దేముడి ఆఖరి కోర్కె తీర్చి పుణ్యం ఒడికట్టుకున్నావన్నమాట! ఆత్మహత్యకు పాల్పడవద్దని ఒక్కముక్క కూడా అతనికి ఎందుకు చెప్పలేదు? చూసి ఆ వినోదాన్ని అనుభవిద్దామనుకోడం నేరం కాదా?"

"చస్తాచస్తా అని పదే పదే అంటుంటే నిజంగా చస్తాడనీ, అదీ చెప్పి మరీ చస్తాడనీ నేనునమ్మాలా? జీవించాలా, మరణించాలా అన్నది ఎవరికి వారు తేల్చుకునే వ్యక్తిగత స్వేచ్ఛ క్రిందికి వస్తుంది. ఏది తనకు మంచి, ఏది చెడు అన్నది ఎవరికి వాళ్లకు తెలుస్తుంది మరొకరికంటే. నేను ఎందుకు జోక్యం చేసుకోవాలి? దేముడు మానవ జీవితాన్ని కాచి వడపోశాడు. నాకన్నా, అగ్నిపుత్రస్వామి కన్నా తెలివైనవాడు. మనందరి దేవుడి మీద తిరుగుబాటుగా తాను మరణించదలచుకున్నానని నా ముందు ప్రకటించాడు. అది హాస్యాస్పదంగా లేదూ? ఆ విషయం మీకూ తెలుసు; సర్వజ్ఞులు. మనందరి దేవుడు ఆ తిరుగుబాటును ఎలా అణచివేస్తాడు లేక దయతో స్వీకరిస్తాడు  అన్నది ఆయన ఇష్టం. కోన్కిస్కా గొట్టంగాళ్ళం మనిద్దరం, తమతో సహా! మనిషికి తిండికన్నా స్వేచ్ఛ ముఖ్యం అని భావించడం వలన రాళ్లను రొట్టెలుగా మార్చగలిగీ మార్చలేదు ఏసుక్రీస్తు. దేవుడున్నాడని రుజువు చేయడం గురించీ కొండమీది నుంచీ దూకు అన్నా దూకలేదు, దూకినా తనను దేవుడు రక్షించగలడన్న నమ్మకం ఉన్నా. అంటే తన మహిమల ద్వారా మనిషికి దేవుడి మీద, తన మీదా విశ్వాసాన్ని కలిగించడం దేవదూత ఏసుకు ఇష్టం లేకపోవటం వలన. మనిషికి దేవుడిని నమ్మటం, నమ్మకపోవడమనే స్వేచ్ఛను ఆయన ఇవ్వదలచాడు. మనిషి దేవుడిని నమ్మదలచుకుంటే మహిమల ద్వారా కాకుండా స్వతస్సిద్ధంగా నమ్మాలి, ప్రలోభాల ద్వారా కాదు.  తిండికన్నా విలువైన అలాంటి స్వేచ్ఛను అనుభవించాలిసిన దేవుడిని నేను నిరోధించడం అతని స్వేచ్ఛకు భంగం కలిగించినట్టు కాదా? తరువాతనైనా దేముడు ఆత్మహత్యకు పాల్పడకుండా ఉండడా?  అయినా మనిషి ఎప్పుడు చావాలి, ఎందుకు చావాలి, ఎలా చావాలి అన్న విషయాలు ముందే విధి లేక మనందరి దేముడు నిర్ణయించి ఉంటాడు. పునర్జన్మ సిద్ధాంతాన్ని కాసేపు మనం మరిచిపోతే – మనందరి దేవుడే దేవుడు

శత్రువైనట్టు అలాంటి పుట్టుకను, జీవితాన్ని ఎందుకిచ్చాడు? ఇచ్చి జీవించడం మానవద్దు అనడంలో కూడా క్రూరత్వం లేదా? అంత మంచిదనం వాడికిచ్చి, కాస్తన్నా జీవించడానికి అవసరమైన కొన్నన్నా మాయామర్మాలూ ఇవ్వకుండా 'జీవించు' అనడంలో ఏ విజ్ఞతుంది మన దేవుడిలో? అతని మంచిదనం, జ్ఞానం లోకకళ్యాణార్థం ఉపయోగపడకుండా అంతరించింది – ఒకవేళ చనిపోయుంటే. వాడి వయసును మించిన, పూలగుచ్ఛం లాంటి జ్ఞానం చితిమంట పాలయ్యుంటుంది ఒకవేళ కొండమీది నుంచీ దొర్లి మరణించి ఉంటే. మనందరి దేవుడి ప్రతినిధిగా మీరు ఆయనను ఇలాంటి ప్రశ్నలు అడిగి సమాధానాలను మా లాంటి పాపులకు చేరవెయ్యకుండా నన్ను తీరుబడిగా చొప్పదంటు ప్రశ్నలు అడగడం న్యాయమా, అగ్నిపుత్రా? అతను చచ్చేదాకా నేను అక్కడలేనపుడు, అతని చావును చూస్తూ వినోదించడమనే ప్రశ్న ఉత్పన్నం కాకూడదే? చాలా అమాయకంగా అడిగారాప్రశ్న. ఫరవాలేదు. నేనేమీ అనుకోను."

"దేవుడికి సవాలు విసిరావు; ఆ విషయం ఆయన చూసుకోగలడు. నాకు ఒక సవాలు విసిరావు. నీ చావుతో దీని శిక్షా కలిసిపోతుంది. దేవుడి మీద అప్పుడు లేని ప్రేమాభిమానాలను ఇప్పుడు అరువు తెచ్చుకుని వాడి తరపున వొకల్తా పుచ్చుకుని వాదనలు వినిపిస్తున్నావురా! అవును మరోసారి రాకొట్టా రా. ఈ భావాలు అప్పుడు నీ దుర్మార్గపు మనసులో కలగనివి. ఏ వ్యక్తి పుట్టుకైనా జీవించడానికి ఉందా, పుట్టగానే చావు గురించీ ఎదురుచూడకుండా చావును తన చేతుల్లోకి తీసుకోడానికుందా?"

"నేను ఇప్పుడిప్పుడే చావదలచుకోలేదు. కానీ మీరు చంపడానికి కంకణంకట్టుకున్నారు. నన్ను చంపి మీరు ఒక హంతకుడిగా మిగిలిపోతారో, దేవుడి ఆజ్ఞ ప్రకారం నన్ను చంపబోతున్నారో అన్న విషయాల జోలికి నేను పోదలచుకోలేదు. చనిపోయిన దేముడిని అడగవలసిన ప్రశ్నను నన్నడుగుతున్నారు అని పిస్తోంది."

“అతి తెలివిని ప్రదర్శించకు. దేముడు చావడానికి నిర్ణయించుకొడాన్ని నీవు సమర్థించే ప్రయత్నం చెయ్యడం వలన నేను ఆ ప్రశ్నను లేవదీశాను.“

“ఈ వ్యక్తి ఆత్మహత్య చేసుకుని చనిపోవాలి అని విధి నిర్ణయిస్తే?"

"ఏ వ్యక్తన్నా ఆత్మహత్య చేసుకుంటే, విధి అలా నిర్ణయించింది అని అనుకుని ఇసుమంతైనా బాధపడకపోవడం మానవత్వం క్రిందికొస్తుందా, అనంతత్వం క్రిందికొస్తుందా?"

"అంత భయంకరమైన పుట్టుక, జీవితం గడుపులుతున్న మనిషి బతుకు చావుకన్నా కనాకష్టమైనది కాదా? ఒక వేళ నేను అతను చావకుండా హిత బోధ చేశాననుకోండి, అలాంటి దుర్భరమైన జీవితాన్ని ఆతను కొనసాగించేట్లు చేసిన పాపం నాకు అంటుకోదా?"

"మనిషి మరో మనిషి చావకుండా అడ్డుపడటం మానవ ధర్మం; మీమాంసకు దిగకూడనిది. అది శిలా శాసనం లాంటిది. నీ తలతిక్క వాదనతో ఆ ధర్మానికి వ్యతిరేకంగా మాట్లాడక."

"వ్యాసుడికి, భీష్ముడికి ధర్మమేదో, అధర్మమేదో నిర్ద్వంద్వముగా తెలియనప్పుడు నాతో 'ధర్మం చెర' అని తమరు అనడంలో న్యాయం ఉందా? తమరు ఇప్పుడు చెబుతున్న విషయం నాకు అప్పుడు తట్టుంటే, దేముడిని చొక్కా ఫిల్ట్ పట్టుకుని కనీసం పోలీసు స్టేషన్ కు లాక్కుపొయ్యేవాడినేమో, ఏమి చెప్పగలనూ?"

"ధర్మాధర్మాల గురించీ నా ఉపన్యాసం విన్నావా?"

"ఇంతవరకూ ఆ భాగ్యం కలగలేదు. నా ధర్మత్నితమ నోటంట రాలిన ప్రతి మాటనూ ముత్యాలలా మూటగట్టి ఇంటికి తెచ్చి నా చెవుల్లో పోస్తుంది."

స్మారకం తప్పి పడున్న స్త్రీ ప్రాణంపోతున్నట్టు మూలిగి వెల్లికిలా పడుకుంది. కత్తిని పరుపుమీద ఉంచి ఆ చేత్తో స్వామి ఆమె జుట్టును సవరించి, పవిటను సర్ది (ఆమె రొమ్ములను అనంతం ఎక్కడ చూసేస్తాడో అన్నట్టు), విడివడిన పెదవులను ముద్దుపెట్టుకున్నాడు అవి మాగిన పనసతొనలలా, విచ్చిన పూవులా భావిస్తూన్నట్టు. దాన్ని అదునుగా తీసుకుని ముందుకు ఉరికాడు అనంతం. మెరుపు వేగంతో కత్తినందుకుని అనంతాన్ని పొడిచాడు. చొక్కా, బనీనుల లోనుంచివెళ్లి అతని రొమ్ము మీద ముద్దుపెట్టుకుంది కొన. వెనక్కు విరుచుపడి అనంతం తల వెనుక భాగం గోడకేసి కొట్టుకుంది. ఏడుపొచ్చింది అనంతానికి తన అశక్తతకు. కత్తి కేవలం గీసుకోడంవలన కొంచెం రక్తం చింది చొక్కా మీద ఎర్రటి మరక అయింది.

"మాంత్రికుడు సాహసంచేయరా, డింభకా, అన్నాడుగాని దుస్సాహసం చెయ్యరా అనలేదు.  దుస్సాహసం చేయకు, అనంతం. నేను నీతో పరమ దుర్మార్గంగా ఉండదలచాను. తేలును, విషనాగును మూర్ఖులు ముద్దుపెట్టుకుంటారు. ఒకనాడు నేను మూర్ఖుడినికాని; నేడు కాదు. జ్ఞానోదయం అయిందనను కానీ; మూర్ఖత్వం వదిలిపోయింది అని  అనడానికి వెనుకంజ వేయను."

అతను మౌనంగా తన చొక్కాను చూసుకున్నాడు. చొక్కాకు కన్నమయింది. విచారించాడు. ఛాతీకి కన్నమవలేదు. సంతోషించాడు,

"ఎలాగూ నీవు నన్ను చంపిపారెయ్య దలచుకున్నపుడు నేను ఈ విధంగా, అశక్తుడిలా, పిరికివాడిలా చావడం కంటే కనీసం మీ కన్నో, పన్నో పోయేట్టు పోరి మరణించడం మేలనిపిస్తోంది."

"నేను నిన్ను చంపకుండా ఒదిలేస్తానేమో అన్న చిరు ఆశ నిన్ను తెగించేట్టు చెయ్యదనుకుంటున్నా."

"నీవు అడగదలచుకున్న ప్రశ్నలు త్వరగా అడిగి నన్ను చంపేసుకో."

"ఇదొక మైండ్ గేమ్. ఇదోరకం చిత్రవధ. కేవలం చావు నీకు శిక్షగా సరిపోదు. నీలో కనీసం పస్చాత్తాపధోరణి కనిపించడంలేదంటే నీలో దుర్మార్గం ఎంత మందంగా  ఘనీభవించిందో అంచనావేయవచ్చు. ఇలాంటివాడివి కాబట్టే మూర్ఛతో కొట్టుకుంటున్న కుర్రాణ్ణి ఒంటిగా వదిలేసి నీ తోవ నీవు చూసుకున్నావు."

"హింసించే జీవితం నుంచి విముక్తిగా ఉపయోగపడే సాధనంగా ఆత్మహత్యను భావించి ఉండవచ్చు. చాలాకాలంనాటి విషయాలు నాకు ఎలా గుర్తుంటాయి? నా జీవన నది చాలాదూరం ప్రవహించింది. ప్రాణాలతో ఉన్నపుడు కొండమీది నుంచి దొర్లో, దూకో చావడానికి చాలా మనస్థైర్యం కావాలి. అపస్మారకస్థితిలో ఆ పిట్టగోడ మీది నుంచి దొర్లి అతనికే తెలియకుండా అతని ప్రాణం పోవడం నయం కాదా? A blessing in disguise. కీడులో మేలును చూసుకునే ప్రయత్నం చెయ్యాలని నాకు నా కఠినమైన ఆరంభ జీవితం పాఠం నేర్పింది... మీరు గమనించవలసిన అతి ముఖ్యాంశం గమనించలేదు. అంతు వున్నట్టులేని ఈ కొండవీడు చాంతాడు లాంటి రచనా సూత్రం కూడా అది. డార్విన్ గారు చెప్పిన జీవ శాస్త్రఅంశాలనుబట్టి ది ఫిట్టెస్ట్ విల్ సర్వైవ్. అలా యోగ్యత లేని జీవాలు నశించిపోతాయి. జీవకోటి జీవితపు కొనసాగింపుకు పర్యావరణానికి అనుగుణంగా తమను తాము రూపాంతరీకరించుకుంటూ పోవాలి (adaptation); గుణాంతరీకరణా అవసరమే. జీవించడానికి అర్హతలను సంపాయించుకున్న నేను జీవించగలుగుతున్నా. తాను తానుగా నిలిచిపోదలచుకున్న దేవుడు నశించివుంటాడు. మనుగడ గురించి ప్రతి జీవీ పోరాడుతుంది. దేవుడిలాంటి జీవి పోరాడ దలచుకోక పోవచ్చు. అతని అన్యాయవు పుట్టుక, దుర్భరమైన జీవితం ప్రభావితం చేసిన మనస్తత్వం – దేవుడి మీదే (ఉన్నాడనుకుని) తిరుగుబాటు చేయాలనిపించడం, చావుతో ప్రేమలో పడెయ్యడం చేసుండొచ్చు. ప్రేమా పిచ్చి ఒకటని విన్నా. మా కృపారావుదీ ఆ బాపతే."

"ఎలాగోలా బతకడమేనా? జీవశాస్త్రంతోనే గాని, నైతిక శాస్త్రంతో – కనీసం, జ్ఞానమున్న జీవికి – అదే – మనిషికి పనిలేదా?"

"నైతికతకు శాస్త్రం ఎక్కడుంది? ఉన్నా జీవశాస్త్రం అని ఆ శాస్త్రానికి పేరున్నట్టు నైతిక శాస్త్రం అని నిర్దుష్టమైన శాస్త్రం యాడుంది?"

"ధర్మం అంటే అదే కదా?"

"పాటించలేనిది, రుజువుచేయలేనిది శాస్త్రమవుతుందా? అనుభావిక సాక్ష్యం (empirical evidence) ఏది?"

"ఇలాంటి వాదనకు అతిచక్కని పదం వుంది – అదే వితండవాదం.

నాకు జ్ఞాపకం లేదు అని, అసలు విషయం మీదినుంచీ కప్పదాటు వేసి న్యాయస్థానాల్లో తప్పించుకోజూడటం సాధ్యం. ఇక్కడా ఆ వీలు లేదు. నేను నిన్ను అడిగింది: మూర్ఛతో పిట్టగోడమీద తన్నుకుంటూ పోరాడుతున్న సాటి మానవుడిని అలా ఒదిలేసి ఎలా వెళ్లగలిగావు అని."

"ఆ ఒంటరితనం, రాత్రివేళ, మూర్ఛ కారణంగా తన్నుకుంటున్న రోగి, అనూహ్యత కారణంగా నా మనసు అల్లకల్లోలంగా మారి నేను చేయవలసిన పనిని చేసి ఉండకపోవచ్చు. నాకే ఎందుకు మీరన్న పనిని చేయలేకపోయానో తెలియడంలేదు. కావాలని చేశానని తమరు ఎందుకు భావిస్తున్నారు?"

"నీవు పచ్చి అబద్ధం అడావు. మరుసటిరోజు దేవుడు చచ్చాడా, బతికున్నాడా అని తెలుసుకోడానికి వార్తాపత్రికలన్నీ తిరగెయ్యలేదూ?"

"అది కేవలం కుతూహలం కారణంగా. ఏ న్యాయశాస్త్రంలో కుతూహలాన్ని చూపడం నేరంగా పరిగణిస్తారు? ఇంతకూ దేవుడు ఉన్నట్టా, పోయినట్టా?"

"నీకు అది అనవసరం. ఒకరి చావుతో ముడిపడున్న కుతూహలాన్ని నేను ఎందుకు తీర్చాలి? గాలికి ఎగిరిపోయుండకపోతే నీవు శవం మీది బొరుగులు ఏరుకుని తినే రకంవి."

"ఆకలివల్ల చావుకు అరంగుళం దూరంలో ఉన్నవాడు శవం మీదివి అని దొరికిన బొరుగులు పక్కకు తోసేస్తాడా?"

"నీవు మాటలు నేర్చిన శునకానివి. అంటే కుక్కవి. పెంపుడిది కావచ్చు, వీధిది కావచ్చు."

"వాడిన ఉపమానాలనే వాడుతున్నారు; కొత్తవి తట్టుండవు. మాటలు, మొరుగులు కూడా మనిషి జీవించడానికి అవసరమయినవి."

"ఒక సాటి మనిషి లేక అభాగ్యుడి ప్రాణంపట్లనే నీ వైఖరి ఇంత ఘోరంగా ఉన్నపుడు ఒక స్నేహితుడికి చేసిన సహాయానికి రుసుము వసూలు చేయడంలో ఆశ్చర్యం ఏముంది?"

బుర్రగోక్కున్నాడు అనంతం.

"కృపారావు విషయమా ఇది?"

"నీవు చేసిన నేరం విషయం నీకు వెంటనే తప్పక గుర్తుకు వస్తుంది."

"చింకి బతుకు బతుకుతున్నవాడిని. అప్పటికినాకు ఏ సాయం చేయని దేముడు తప్ప మరో దిక్కూమొక్కూ లేని బికారిని, పొద్దెలా గడుస్తుందా అన్న ఆలోచన మనసంతా నిండిన వాడిని. కృపారావు నగ్నంగా తన, తన భార్య డబ్బు మీద దొర్లుతున్నాడు. రావు కుటుంబం కూలేట్లున్నపుడు దాన్ని నిలబెట్టటం వలన నాకూ లాభం చేకూరుతుంది. పోనీ అది ఇద్దరు స్నేహితుల మధ్యనుండే వ్యాపారంగా భావించండి. స్నేహితులు ఒకరితో ఒకరు వ్యాపారం చేసుకోకూడదన్న నియమం ఏ వ్యాపార శాస్త్రంలో ఉంది? కౌటిల్యుడిది అని చెప్పబడుతున్న అర్థశాస్త్రంలో కూడా ఉంటుందని అనుకోను. ఉంటే శత్రువులిద్దరు ఒకరితో ఒకరు వ్యాపారం చేసుకోకూడదని ఉందేమో. ఆ వ్యాపార ఒప్పందం నుంచీ కృపారావు వైదొలిగే వీలుంది కదా; అదేమీ బలవంతపు బ్రాహ్మణార్థం కాదె? ఒక ఉరగం నుంచీ కృపారావు సంసారాన్ని కాపాడాను. నా ఖాతాలో అది ఒక మేలుగా జమకావాలి. మరోసారి స్వామి వారు ఆలోచించాలి. ఆయన జ్ఞాని."

"రాయుడి నుంచీ డబ్బు లాక్కున్నావు. అదీ తప్పు కాదంటావా?"

"తప్పని మీరంటారా?"

"అన్నాననుకుని నీవు సమాధానం చెప్పు."

"రాయుడు రూపానికి ఒక భల్లూకం, గుణానికి  ఉరగం; ఆ విషయం నాకు అనవసరం; వాడితో పడుకున్నవాళ్ళ, కౌగలించుకున్న వాళ్ళ తలపోటది. వాడు ఒక లంచగొండి వెధవ. మరొకరి ధర్మపత్నిని మీలాగే లొంగ తీసుకుని అనుభవిస్తున్న కీచక సోదరుడు. తన భార్యను రంగా అనుభవిస్తుంటే వాడి బాక్సింగ్ పిడికిళ్లకు భయపడి ఆదుపు చెయ్యలేని చవలాయి, గాడిద కూడా అసహ్యించుకునే మనిషి. ఇందాక నా గురించీ నేనే అన్నట్టు, నేను అప్పుడు లేమితో బాధపడుతున్నవాడిని. దిక్కూమొక్కూ లేనివాడిని. దైవోపహతుడిని. పాపపు సొమ్ములోనించి కొంచం మొత్తాన్ని నేను లాగుకుంటే దాన్ని చెడుగా ఏ యమధర్మరాజైనా నా ఖాతాలో ఎలా వేస్తాడు? బిచ్చగాడిచిప్పనుంచీ దోచుకోలేదే?"

"సుమతిని మోసం చేసి ఆమెను నీ వలలో వేసుకుని, ఆమెను నిచ్చెనగా చేసుకుని పైకి రావడం నీచాతినీచం కాదా? ఆ ఒక్క పాపానికి నీకు శిరస్ఛేధన చెయ్యవద్దు?"

ముందుకొచ్చి ఎడమ కాలితో అనంతాన్ని తన్ని జాగ్రత్తగా వెనక్కు వెళ్లి కూర్చున్నాడు.

"తమరి పక్కనున్న స్త్రీ తమ ధర్మపత్నా? మీరు రంకు చేస్తూ నా తప్పులెన్నుతారా? నా అందాన్ని, నా మాటకారితనాన్ని చూసి ఐస్కాంతం వైపు ఆకర్షించబడినట్టు ఆకర్షించబడింది. ఐస్కాంతంది తప్పవుతుందా? ఆమెకు, కృపా గారికి కప్పెట్టేంత సంపదుంది. నేను దాన్ని లాక్కోలేదు; ఆమె ఖర్చుపెట్టింది. దానివల్ల ఆ కుటుంబం దివాళా ఎత్తి వీధిని పడలేదు. మరో పదిమంది అనంతాలకు వాళ్ళు సహాయం చెయ్యగలరు. భక్తులు మీకు ఇచ్చేది మీరు లాక్కున్నట్టవుతుందా? వాళ్ళ దూలకొద్దీ వాళ్ళిస్తారు; మీరు పుచ్చుకుని ఆశ్రమాలు కట్టుకుంటారు, పిస్తోళ్లు, కత్తులూ కొనుక్కుని దౌర్జన్యానికి దిగుతారు. నా అవసరం తీరినతరువాత దానివల్ల ఆ కుటుంబం దివాళా ఎత్తి వీధిని పడలేదు. మరో పదిమంది అనంతాలకు వాళ్ళు సహాయం చెయ్యగలరు. కృపాగారికి అచ్చంగా దక్కేట్టు సుమతి గారిని  ఎలాగూ ఒదిలెయ్య దలచుకున్నాను. వదిలేశాను. కృపా గారు తొందరపడ్డారు."

"ఈ స్త్రీ 'మీ ధర్మపత్నా' అని నన్ను ప్రశ్నించావు లేక ఎత్తిపొడిచావు! మా ఇద్దరి వ్యవహారం నేను నీకు వేస్తున్న శిక్షగా తీసుకో. నీవు పైకి రావాలని చూసుకున్నవేగాని ఒక కాపురంలో నిప్పులు పోశావన్న ఆలోచన నిన్ను ఒక్క రాత్రన్నా బాధించింది?"

"ఆ సంసారం నిలబడే ఉండేది, కృపా రాజీపడి ఉంటే. కనీసం ఆమె నన్ను వదిలేసినా ఆ సంసారం నిక్షేపంగా ఉండేది. తప్పంతా లేక నెపమంతా నా మీద ఎందుకు పెడుతున్నారు? రాయుడితో  సుమతి వ్యభిచారం చేస్తున్నపుడు కూడా ఛిద్రంకాని సంసారం నాతో ఆమె సంసారమో మరొకటో చేస్తున్నపుడు ఛిద్రమైంది అని భావించవచ్చా? ఏదన్నా ఒక దుర్ఘటన జరిగితే దానికి ఎవరెవరి ప్రమేయం ఉంది అన్న సరైన ఆలోచన చెయ్యాలి; బాధ్యతను పాపంలా న్యాయంగా పంచిపెట్టాలి. ఆమె తన చెయ్యి ఇవ్వకుండా నా ఒక్కచెయ్యే చప్పట్లు కొట్టగలిగేదా?"

"నీకూ అందులో భాగం ఉందని ఒప్పుకుంటావా కనీసం?"

"జరిగిపోయినదాన్ని గురించీ ఇప్పుడు వగచడం ఎందుకు? మీరెవరూ? సుమతి తాలూకూనా, కృపాగాడి జిల్లానా?"

"కృపా గారు అంటే మర్యాదగా ఉంటుందనుకుంటాను. కృపా ఏమయ్యాడో తెలుసా?"

"తెలియలేదు. సముద్రంపాలయ్యుంటాడు. శవం కూడా బయటపడలేదు. మీరెరుగని విషయం లేదు కదా. మీరు చెప్పండి; కృపాగారు ఏమయ్యారు?"

"చెప్పను. సుమతి ఏమైంది? నాకు తెలిసీ అడుగుతున్నా."

"మనోవ్యాధితో మరణించింది."

"ఎందువల్ల?"

"నాకు తెలియదు. కృపారావు గారు దూరమైపోయాడనీ కావచ్చు. డిప్రెషన్ వల్ల కావచ్చు. తన నడవడి మీద తనకే కలిగిన ఏవగింపు కావచ్చు. దేవుడు ఆత్మహత్య చేసుకోదలచుకుంటే మనం చేయగలిగింది ఏదీ ఎలా లేదో, సుమతి మరణానికీ స్వయంకృతా పరాధమే కారణం. మదాం బోవరీ, అన్నా కెరీనినా మృతులకు ఎవరు కారణం? నేను చేయగలిగింది చేశాను – అదే – విచారించడం."

"ఆమె బతుకు ఏమవుతుందో అని కూడా చూడకుండా నువ్వు ఆమె కష్ట సమయంలో, ఒంటరితనంలో ఆమెకు ఊరట కలిగించకుండా ఆమెనొదిలేసి మరొకరిని పెళ్లాడటం కూడా కారణం కాదా?"

"ఆమెను కూడటం వలన ఒక సంసారం కూలిందన్నారు. ఆ దివ్యమైన నోటితోనే, ఆమెను ఒదిలేసినందుకు తప్పు పడుతున్నారు! ఆమె అంత త్వరగా మరణిస్తుందనీ, అంతవరకూ పెళ్లిని వాయిదా వేసుకుందాము అనుకోడానికి భవిష్యత్తులో జరగబోయే పరిణామాలు, మీకు తెలిసినట్టుగా నాకు తెలియవు కూడా."

“ఆమె విషాదాంత జీవితంలో నీ పాత్ర ఉందా లేదా?"

"పాత్ర, చెంబు ఉండటం వేరు, ఆమె జీవితం నాశనమవడానికి కేవలం నేను కారణమా కాదా అన్న విషయం వేరు. ప్రతి వ్యక్తి బాగోగులలో కనీసం పరోక్షంగా సమాజ బాధ్యత లేక పాత్ర, కోతిలాంటి మనసు పాత్ర ఉండకపోదు. సమాజాన్ని బోను ఎక్కించి దానికి కారాగార లేక ఉరి శిక్ష విధించ గలిగిన న్యాయమూర్తి పుట్టలేదు. నన్ను ప్రశ్నలతో ఎంతసేపు వేధించదలచారో చెప్పండి. నిరవధికంగా నన్ను మీ ప్రశ్నలతో చంపుకు తినకండి. నేనూ మనిషినే; మనిషంటే బాధకు పర్యాయపదం," అంటూ ఏడిచాడు.

"నీవు మనిషిరూపంలోని రాక్షసుడివి. నీకు బాధపెట్టటమేకాని బాధపడటం వీలవుతుందని నేను భావించడం లేదు. చెప్పాను కదా నిన్ను నిమిషంలో చంపడమంటే నీ దుర్మార్గాలకు సరైన శిక్ష అవదు. అనుభవించు."

"బాధలేకుండానే ఏడుపు వస్తుందా?"

"నీలాంటి వాడికి వస్తుంది. నీది దొంగ ఏడుపు."

"మీ దగ్గిర నేర్చుకుంటాను దొర ఏడుపు – ఏడిచి చూపండి."

"నేను చూపక్కరాలా నిజమైన ఏడుపును నీ చేతే ఏడిపించగలను.ఈ లోకాన్ని వీడిపోవడానికి తొందర ఎందుకు? నిన్ను చంపితే లైంగిక శీలంకన్నా అత్యంత విలువైనదిగా భావించే మంగళసూత్రాన్నినీ భార్యకు కాకుండా చేస్తానే అన్న సందిగ్ధంలో ఉన్నాను. మంగళసూత్రాలు ధరించిన ప్రతి భార్య శీలవంతురాలు కానూ వచ్చు కాకపోనూ వచ్చు. అది మగాడు ఈ స్త్రీ నాది అని కట్టుకున్న లైసెన్సా లేక ఆమెకు కట్టిన ఒక జీవితకాలపు ఉరితాడా, కుక్కమెడకు తగిలించిన బెల్టా అన్న విషయాలు గొంతులు చిరిగేట్టు, నాలుకలు రాలేట్టు, నోళ్ళు చచ్చుబడేట్టూ చర్చించబడినాయి; విషాలు కక్కబడ్డాయి. ఆ చర్చ లేక చర్చలు అప్రస్తుతం. నీ తదుపరి జన్మ – గుణంలో ఇప్పటిలాగే, ఆకారంలో మొసలిలాంటిదో, బల్లిలాంటిదో, కప్పలాంటిదో – కావచ్చు. కనీసం ఈ కాస్తసేపు నీ సుందర రూపంలో జీవించు – బాధపడుతూనైనా, ఏడుస్తూనైనా – మాట్లాడుతూ."

"మీరు నా తప్పులకు నన్ను శిక్షించే వ్యక్తేకాక, Sade de Marquis గారి అన్నయ్య గారని నాకు అనిపిస్తోంది. క్రీస్తు తనకు ఏమి జరుగుతుందో ముందే తెలిసేవుంటుంది, ఇలా అన్నాడు:1. ఎవరి తప్పు ఒప్పులనూ ఎన్నకు; అలా చేస్తే నీవీ ఎన్నబడతాయి; 2. నీ కంటిలోని దూలాన్ని ఒదిలేసి ఎదుటివాడి కంటిలోని నలక గురించీ మాట్లాడక; 3. మీలో ఏ తప్పూ చేయని వాడు తప్పు చేసినవాడి మీద మొదటి రాయిని వేయండి; వగైరా. ఒక విధంగా సమాజాలు న్యాయవ్యవస్థలు ఏర్పరచుకోడంలో హిపోక్రసీ లేకపోలేదు. అది అవసరమైన చెడు (necessary evil) అని ఒప్పుకుంటా; అది వేరే విషయం. నా పట్ల మీకు ఇవ్వని అధికారాన్ని చెలాయించినందుకు మిమ్మల్ని శిక్షించేవాడుండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నా. మీరు దేవుడు కాదు; దేముడున్నాడో లేదో మీకే తెలియదు మీరు దేవదూత అయ్యుంటే తప్ప. మీరు దేవదూతయ్యుంటే దేవదూత అని నిరూపించుకోవాల్సిన అవసరముంది మిమ్మల్ని విశ్వసించాలంటే. విశ్వసించకపోతే నాకేమీ అని తమరు అనుకుంటే మా కర్మ. మీరు నన్ను చంపడం వలన ఏ నేరము చెయ్యని నా పిల్లలనూ దండించినట్టవుతుందని గ్రహించండి."

"నేను దేవదూతనా, దేవుడినా అన్న విషయం నీలాంటి దోమముందు, నల్లిముందు, బల్లిముందు, తుచ్ఛుడిముందు రుజువుచేసుకోవాలిసిన అగత్యం నాకు ఏమాత్రం లేదు. ఒక స్వామిగానేగాక మనిషిగా చట్టాన్ని నా రెండు చేతుల్లోకి తీసుకుని నిన్ను శిక్షించే హక్కు, బాధ్యత నాకున్నాయని నీకు ఆదిలోనే మనవి చేశాను; చర్చించిన విషయాలు తిరిగి చర్చకు తేకు. అందరూ కాకపోయినా, చాలామంది నేను మహిమాన్వితుడిని అని నమ్ముతున్నపుడు నీ లాంటి గొట్టం అభిప్రాయానికి విలువెంత? పదుగురాడుమాట పాడియై ధరఁజెల్లు. నీ కడుపున పుట్టిన నేరానికి లేక పుట్టించబడిన నేరానికి నీకు అంటించే నిప్పు నీ పిల్లనూ తాకుతుంది. తలిదండ్రుల పాపాలు పిల్లలకు తగులుతాయి వద్దనుకున్నా. ఈ నిప్పు తప్పు అని ఒప్పుకుంటున్నా. నీవు బతికుంటే నీ తప్పుల పరంపర కొనసాగుతూనే ఉంటుంది. ఏ మనిషి జీవితం

చూసినా ఏముందీ గర్వకారణం? తిండి తినడం, మల విసర్జన చెయ్యడం! అంతమందిని శిక్షించే శక్తి నాకు ఇవ్వబడలేదు. నిన్ను ఎంపికచేసుకున్నానంటే కారణం నీకే తెలుస్తుంది కన్నుమూసే ఆఖరి క్షణంలో."

"మీరు ఏ చట్టం ప్రకారం నన్ను శిక్షించదలచుకున్నారు?"

"మళ్ళీ మొదటికొచ్చావు. చట్టం ఒక గాడిద అని అనిపించాడు డికెన్స్ ఒక పాత్ర ద్వారా. చట్టాలు నాకు, నీకు, మనం వున్న చోటుకు వర్తించవు. This i a land  of no law అంటే చట్టాన్ని నిషేధించిన క్షేత్రం. ఇది కాంగెరూ కోర్ట్ (kangaroo court) గా భావించుకో నీ సంతృప్తికొరకు. ఏ దగుల్బాజీ కోర్ట్ అయితేనేమి శిక్షించడానికి? శిక్షించడం ముఖ్యం!"

"మేలుకుని ఉంటే కనీసం ఆ స్త్రీ దృష్టిలో – మీరు హంతకుడిగా, నేరస్థుడుగా మిగిలిపోతారు – ఒక స్వామిగా కాదు. మీది పగ సాధింపు వ్యవహారమేమో అనిపిస్తోంది. నాకేమి అనిపిస్తోంది అన్న విషయం మీకు అనవసరం అని నాకు తెలుసు. ఎద్దుపుండు కాకికి రుచి అని విన్నాను. మనసుతో చేసే హత్యలు ఇతర నేరాలూ పరిగణలోకి రావు. ఒకేనేరానికి న్యాయ శాస్త్రంలో రెండు సార్లు శిక్షించడం ఉండదు. అలాచేస్తే దాన్ని double jeopardy  అంటారు. మీకు భారతీయ శిక్షాస్మృతి తో పనిలేదని, మీదంటూ మీకు ఒకటి ఏర్పరచుకున్నారనీ తెలుసు."

"నీవు చెప్పదలచుకున్నది చెప్పే అవకాశం నీకు ఇచ్చాను; పూర్వాపరాలు నాకు తెలిసినా. Audi alteram partem; అది – నేరస్థుడుగా, నేరస్థుడుగా భావించబడుతున్నవాడు చెప్పేది కూడా విను అనే న్యాయసూత్రం. ఇక నేను చెయ్యవలసినది నేను చేస్తాను. నీకు రెండు నిమిషాల సమయం తరువాత నీకు  నూకలు చెల్లుతాయి,"

అంటున్నప్పుడు అగ్నిపుత్ర మొహం అగ్నిగోళంలా వెలుగుతోంది; కళ్ళనిండా పగ.

"నేను అంత తార్కికంగా చెప్పినదంతా కంఠ శోషేనా?"

"ఒక్కండును, ఒక్కండును నీ మొర ఆలకింపడు. నా అంతరాత్మ ప్రబోధిస్తోంది నీవు నేరస్థుడివే అని – నీవు తర్కాన్ని కవచంగా, కత్తిగా, డాలుగా ఉపయోగించుకున్నా. తర్కం వేరు, సత్యం వేరు."

ఆ స్త్రీ దిగ్గున లేచి కూర్చుని ఏడవడం మొదలుపెట్టింది.

"ఇంతవరకూ నిగ్రహంతో ఉన్నాను స్వామి. మీరు యమధర్మరాజంత గొప్పవారు; నేను సావిత్రిని కాదు, ఆయన సత్యవంతుడూ కాదు. మిమ్మల్ని వేడుకుంటున్నా. నా మొహం చూసి, నాకు మీ పట్ల గల నా భక్తిని పరిగణలోకి తీసుకుని నా భర్తను ఒదిలెయ్యండి కృపతో. నా శరీరాన్నీ, మనసునూ  ప్రసాదంగా అర్పించుకున్నా కదా!"

"అయ్యా,  నేను నా పాతికేళ్ల ముందు జీవితంలో ఎంత మంచిగా ఉన్నానో; నిజాయితీతోటి, శీలంతోటి బతికానో; దానివలన ఎన్ని ఇబ్బందులపాలవ్వాల్సి వచ్చిందో తమరు తమ దివ్యజ్ఞానంతో గ్రహించే ప్రయత్నం చెయ్యండి. నన్ను ఒదిలెయ్యండి; రాబోయే జన్మలో మీ భార్య కడుపున పుడతాను. మీ ఈ రహస్యాన్ని మనసు సరిహద్దును దాటనీయను. మీ ప్రవచనాలన్నిటికీ హాజరవుతుంటాను. నాకు కలిగినదానికి తగినట్టు విరాళాన్ని మల్లెపూవుల్లో పెట్టియిస్తాను. మల్లెపూలంటే

నాకు ఎంతో ఇష్టం; ముఖ్యంగా మా ఆవిడ జడలోవి; ఇకనుంచీ ఆ ఇష్టం ఉండకపోవచ్చు. వాటి గురించీ తలచుకున్నా, వెన్నెల గురించీ తలచుకున్నా రసికుడినైన నాకు పొర్లిపొర్లి ఏడవాలనుంది ఇప్పుడు . నాకు నన్ను చంపకుండానే మీరు చేసిన నష్టం చాలు, వేసిన శిక్ష చాలు. భయంతో చంపారు – దాస్తోవిస్కీని జార్ చంపినట్టు. జీవితాంతం ఈ అనుభవాలు నీడలా వెన్నంటుతాయి. నీడ బాధించదు; అనుభవం బాధిస్తుంది – అది వేరే విషయం. నాకు భార్యే కాదు (ఆమె గురించీ నేను ఇక పట్టించుకోనక్కరలేదు నిజానికి) పిల్లలున్నారు. వాళ్లంటే నాకు ప్రాణం. నామీద వాళ్ళను ఎక్కించుకుని తొక్కించుకోడం, వాళ్ళ చేత నా బుగ్గలు కొరికించుకోడం అంటే నాకు మహదానందం. ఆ పనులు వాళ్లకూ అంతే ఆనందమిస్తాయి; అది వాళ్లకు లేకుండా పోతుంది. బిడ్డ పేరు చెప్పంగానే పులే గోవును నమ్మి వదిలేసింది. మీరు మనిషి; పులికన్నా గొప్పవారు. కృప చూపండి."

మౌనం వహించాడు స్వామి. ఆ మౌనమూ అనంతాన్ని హింసిస్తోంది.

"వెళ్ళిపో, నీ భార్యను తీసుకుని."

ఎందుకైనా మంచిదని పిస్తోలు ఎక్కుపెట్టి ఉంచి, కత్తిని దూరంగా తోసేసి అన్నాడు అగ్నిపుత్ర.

అనంతం సాష్టాంగపడ్డాడు.

"మీ ప్రవచనాలను వినడానికి నాకు వీలయినపుడల్లా వస్తుంటాను,"

లేచి గదిలోనుంచీ వెలుపలికి నడిచాడు. ప్రాణం ఇంత తీపైనదా అనిపించింది. తనకు ఇది మూడో జన్మ. ఆమె అతన్ని అనుసరించింది మువ్వలు ఘల్లుమంటుండగా. ఆమె తన వెనుక వస్తోందా లేదా అన్నది పట్టించుకోకుండా ఆశ్రమం పరిసరాల వెలుపలికి వచ్చి వెనక్కు చూశాడు. పులిబోను నుంచీ బైటపడినట్టనిపించింది.

ఆమె వెళ్లిపోతుంటే “అగ్నిపుత్రకు” తన భార్య సుమతి గుర్తుకొచ్చింది. కళ్ళు చెమర్చాయి.

దేన్నైనా అతిగా ప్రేమిస్తే అతి దుఃఖాన్ని భరించక తప్పదు.

*(సమాప్తం)*

COMMENTS